బోరు గుంతను పూడ్చేయించిన అధికారులు

శివ్వంపేట, ఏప్రిల్ 18: మండలంలోని పిల్లుట్ల శివారులో రోడ్డు పక్కనే ఉన్న బోరు గుంతను అధికారులు శుక్రవారం పూడ్చేయించారు. నీరు పడకపోవడంతో బోరు గుంతను పూడ్చకుండానే వెళ్లిపోవడంతో ప్రమాదకరంగా మారింది. బోరుగుంతతో పొంచి ఉన్న ప్రమాదం ప్రచురితం చేయడంతో సంబంధిత అధికారులు స్పందించి భూ యజమానితో బోరుగుంతను పూడ్చేయించారు.

ఘనంగా పెద్దమ్మ బోనాలు

ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని దామరచెర్వు గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఇంట్లో నుంచి బోనాలు పెద్దమ్మగుడికి తీసుకెళ్లారు. మూడేండ్ల తరువాత పెద్దమ్మ పండగ చేయడంతో అంగరంగ వైభవంగా తీశారు. ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు హాజరై పూజలు చేశారు. పద్మాదేవేందర్‌రెడ్డి బోనం ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు.

పెండ్లికి హాజరైన మాజీ ఎమ్మెల్యే

రామాయంపేట, ఏప్రిల్ 18: రామాయంపేట పట్టణంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఓ పెండ్లికి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. శుక్రవారం జరిగిన మద్దెల వాణి, కృష్ణ దంపతుల కుమార్తె దివ్య–ఉదయ్‌కుమార్‌ల పెండ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట పురపాలిక మాజీ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, మాజీ సర్పంచ్ పాతూరి ప్రభావతి, ఉమామహేశ్వర్, యాదగిరి ఉన్నారు.

కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ నగేశ్

ఐకేపీ సీసీ లక్ష్మీతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిజాంపేట, ఏప్రిల్ 18: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేశ్ ఆదేశించారు. శుక్రవారం వెంకటాపూర్(కె)లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే ఓపీఎంఎస్‌లో నమోదు చేయడంతో సకాలంలో రైతులకు ధాన్యం డబ్బులు అందుతాయన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం ఎట్టి పరిస్థితుల్లో కేంద్రంలో ఉండరాదన్నారు. ఆయన వెంట ఐకేపీ సీసీ లక్ష్మి, రైతులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చేగుంట, ఏప్రిల్ 18: చేగుంటకు చెందిన గోరంట్ల వెంకటేశం చెరువులో పడి మృతి చెందాడు. పేద కుటుంబం కావడంతో శుక్రవారం బాధిత కుటుంబాన్ని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతి పరామర్శించి, దశదిన కర్మ కోసం క్వింటాల్ బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మ్యాకల రవి, జూకంటి రాజాగౌడ్, సభ్యులు మ్యాకల శ్రీనివాస్, నాగులు, కర్రె తిరుపతి,యాదగిరి, అశోక్, సతీశ్, మైనార్టీ నాయకులు నదీమ్,బాసం శెట్టి రాజు తదితరులున్నారు.

సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం

అల్లాదుర్గం, ఏప్రిల్ 18ః మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో రమాదేవి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, నాయకులు శేషారెడ్డి, బాలకిషన్, విఠల్‌రెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

అనాథ పిల్లలకు దుబ్బాక మహరాజ్ ఆర్థిక సాయం

పాపన్నపేట, ఏప్రిల్ 18: మండలంలోని కుర్తివాడ గ్రామానికి చెందిన ముగ్గురు అనాథ పిల్లలకు దుబ్బాక స్వామి సమర్థ మహరాజ్ తరపున శుక్రవారం రూ.11వేల ఆర్థిక సాయం అందజేసినట్లు కొత్త విశాంత్ గుప్తా తెలిపారు. మాజీ సర్పంచ్ కొత్తూరి స్రవంతి శ్రీనివాస్, మధు, పిల్లల మేనమామలు కమలాకర్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

బేతాళస్వామికి బండ్ల ఊరేగింపు

అల్లాదుర్గం, ఏప్రిల్ 18: బేతాళస్వామి జాతర కనులపండువగా కొనసాగుతున్నది. శుక్రవారం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. రెడ్డిపల్లి, రాంపూర్, కాయిదంపల్లి, బహిరన్‌దిబ్బ, వెంకట్రావ్‌పేట, చేవెళ్ల గ్రామాలకు చెందిన భక్తులు ఎడ్ల బండ్లను స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రతి గింజనూ ప్రభుత్వం కొనాలి

చేగుంట: నార్సింగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

కొల్చారం: చిన్నఘనపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


చిలిపిచెడ్: చండూర్‌లో ధాన్యం కొనుగోలు సెంటర్ వద్ద రైతులకు సూచనలు ఇస్తున్న ఏపీఎం ప్రేమలత

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- కొల్చారం మండలం చిన్నఘనపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం

చేగుంట, ఏప్రిల్ 18: రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. నార్సింగి మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దుబ్బాక ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మండలంలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనాలని, కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించాలని, ఎక్కువ తరుగు లేకుండా, డబ్బులు తొందరగా వచ్చేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి, జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఏవో హరి ప్రసాద్, మాధవి, ఏపీఎం లక్ష్మీనర్సమ్మ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొల్చారం, ఏప్రిల్ 18: మండలంలోని చిన్నఘనపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం సంగాయిపేట ఫంక్షన్ హాల్లో ఓ వివాహానికి హాజరయ్యారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, బాగారెడ్డి, ముత్యంగారి సంతోష్ కుమార్, రవితేజరెడ్డి, రైతులు పాల్గొన్నారు. చిలిపిచెడ్ మండలంలోని చండూరులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఏపీఎం ప్రేమతల రైతులకు సూచనలిచ్చారు.

వరంగల్ సభకు భారీగా తరలిరావాలి

కౌడిపల్లిలో చలో వరంగల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన బీఆర్ఎస్ నాయకులు

చిన్నశంకరంపేటలో వాల్‌రైటింగ్ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కౌడిపల్లి, ఏప్రిల్ 18: ఈనెల 27న వరంగల్‌లోనిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలం నుంచి భారీగా తరలి వెళ్లి విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు సారా రామాగౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజునాయక్, సర్పంచులు ఎల్లమయ్య, కాంతారావు, అమర్ సింగ్, శ్యాంసుందర్, ఎంపీటీసీలు పవీణ్‌కుమార్, సాయా గౌడ్, కొండల్‌రెడ్డి, పోల నవీన్, సుధాకర్, మల్లేశం, ఆంజనేయులు, రవి సాగర్ ఉన్నారు.

సిల్వర్ జూబ్లీ సభను విజయవంతం చేయాలి

నిజాంపేట, ఏప్రిల్ 18: ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు జిట్టి రమేశ్ పిలుపునిచ్చారు.

విస్తృతంగా వరంగల్ సభ రైటింగ్

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 18: వరంగల్ సభకు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు పిలుపునిచ్చారు. వాల్ రైటింగ్ చేశారు. ఈ నెల 27న రజతోత్సవ సభకు భారీగా ప్రజలను తరలించేందుకు బీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి భూ భారతి

- జూన్ 2 నుంచి పల్లెపల్లెకు రెవెన్యు సదస్సులు
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- భూభారతి చట్టంపై రైతులకు అవగాహన

అల్లాదుర్గంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అల్లాదుర్గం, ఏప్రిల్ 18: గ్రామాల్లోని భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మండలంలోని చేవెళ్ల రైతువేదికలో భూ భారతి చట్టంపై శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను విచారించి ఏడు రోజుల్లో నోటీసులు జారీ చేసి, నెల రోజుల్లో సమస్య పరిష్కారిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయంలో అప్పీలు చేసుకునే అవకాశం ఉన్నదన్నారు. చట్టంలో పహాణీల విధానం అమలుచేస్తున్నట్లు వెల్లడించారు. పేర్లు సరిగ్గా నమోదు కాక, విస్తర్ణం హెచ్చుతగ్గులు, కాస్తులో ఉండి కూడా ఆన్‌లైన్‌లో లేకపోవడం లాంటి ఎన్నో సమస్యలు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. భూధార్ కార్డుల రూపంలో రైతులకు భూముల వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. భూదాన్ కార్డు నెంబర్ శాశ్వతంగా ఉంటుందన్నారు. జిల్లాలో గతేడాదిలో పలు రకాల సమస్యలతో పరిష్కారం కాని 14 వేల ఎకరాల అసైన్డ్ భూమిలో 12 వేల ఎకరాల భూమిని పరిష్కరించినట్లు తెలిపారు. 2వేల ఎకరాల భూమిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్, మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ మల్లయ్య, ఆర్ఐ సందీప్, రైతులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, ఏప్రిల్ 18: రైతులకు సమగ్ర న్యాయం చేసేందుకే ప్రభుత్వం భూ భారతి చేపట్టిందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. రామాయాంపేట లోని రైతువేదికలో నిర్వహించిన భూ భారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. జూన్ 2 నుంచి పల్లెపల్లెకు రెవెన్యు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో రమాదేవి, డీపీఆర్వో రామచంద్రరాజు, తహసీల్దార్ రజినీకుమారి, ఎంపీడీవో షాజులుద్దీన్, ఏవో రాజ్‌నారాయణ, సుప్రభాతరావు, రాంచందర్‌గౌడ్, దేమె యాదగిరి, యాదగిరి, శారదరాజు, చింతల యాదగిరి పాల్గొన్నారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే


నార్సింగి మండల కేంద్రంలో ఆర్టీ బస్సులను నిలుపాలని కోరుతూ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు యాదగిరి యాదవ్

-దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట,ఏప్రిల్18: వేసవి ముగిసే వరకు గ్రామాల్లోని ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. నర్సంపల్లిలోని పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణమహోత్సంలో శుక్రవారం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధికి కేసీఆర్ కృషి చేశారన్నారు. గ్రామాల్లో తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మిషన్ భగీరథ ద్వారా ప్రజల అవసరాలకు సరిపడు తాగు నీరు అందించారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పాత రోజులు తీసుకొచ్చిందన్నారు. నీళ్ల కోసం బోరుబావుల నుంచి తెచ్చుకునే పరిస్థితి నెలకొందన్నారు. తాగు నీటి సమస్య అందిరి సమస్యగా భావించి పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రై డే

శిలువను ఊరేగింపుగా చర్చిలోకి తీసుకెళ్తున్న పాస్టర్లు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 18: మెదక్ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా వేలాది మంది భక్తులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిలువను ఊరేగించిన అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసయ్య భక్తి గీతాలు ఆలపించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా మెదక్ డయాసిస్ పరిధిలోని పలు జిల్లాల నుంచి క్రైస్తవులు భారీగా తరలిరావడంతో చర్చి ప్రాంతం కిటకిటలాడింది. గుడ్ ఫ్రై డేను పురస్కరించుకుని చర్చికి వచ్చిన భక్తులకు బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ జయరాజ్ మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. భక్తుల సౌకర్యార్థం చర్చి ప్రాంగణంలో టెంట్లు, శామియానాలు ఏర్పాటు చేశారు. పాస్టర్లు డేవిడ్, శ్రీనివాస్, జైపాల్, శ్రీనివాస్ సంఘ పెద్దలు గంట సంపత్, జాన్సన్, సాంసన్ సందీప్, సువణ్ డగ్లస్, డాన్సన్, గెలెన్ చిత్తరంజన్, సునీల్, జాయ్ ముర్రే, వికాస్ పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 18: మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పెద్దశంకరంపేటలో

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 18: పెద్దశంకరంపేటలోని సీఎస్ఐ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు వేడుకలను జరుపుకొన్నారు. సామూహికంగా ప్రార్థనలు చేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

భక్తులకు మజ్జిగ అందిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ జయరాజ్

అనుమతుల్లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు

వాగ్వాదానికి దిగిన ఇరు వర్గాలు

డీఎస్పీ ప్రసన్న కుమార్

కొల్చారం, ఏప్రిల్ 18: అనుమతుల్లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. కొల్చారంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి ఏర్పాట్లు చేస్తుండగా దళిత నాయకులు అభ్యంతరం తెలుపడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కొందరు అనుమతి లేకుండా రోడ్డుకు అడ్డంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంతో వివాదం తలెత్తింది. గతంలో ఇదే స్థలంలో మల్లినాథ సూరి, వివేకానంద విగ్రహాల ఏర్పాటుకు అనుమతి అడిగితే అధికారులు ఇవ్వలేదని, ఇప్పుడు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుతో తామూ శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని యువజన సంఘాల నాయకులు పనులు ప్రారంభించారు. గద్దె నిర్మాణానికి గుంత తీస్తుండగా అంబేద్కర్ విగ్రహానికి అడ్డుగా ఉందని దళిత నాయకులు అడ్డుపడ్డారు. ఇరువర్గాల వారు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గౌస్ ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాల వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పరిస్థితి విషమించడంతో అదనపు బలగాలను మోహరించారు. అనంతరం డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి కొల్చారాన్ని సందర్శించి, వివాదాస్పద విగ్రహాన్ని పరిశీలించారు. విగ్రహాలు ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. కొల్చారంలో రెండు విగ్రహాలు అనుమతుల్లేకుండా ఏర్పాటు చేశారని, వాటిని తొలిగించడానికి సహకరించాలని ఇరువర్గాల వారికి చెప్పామన్నారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేస్తామన్నారు.

పేద వధువులకు ఆర్థిక సాయం

రామాయంపేట/ రామాయంపేట రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని అక్కన్నపేటకు చెందిన రాజేశ్వరి, సుధాకర్ దంపతుల కుమార్తె వివాహానికి లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ పుస్తెమట్టెలు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు చిట్టిమల్లి నరేందర్‌రెడ్డి, సిద్ధిరాంరెడ్డి, పుట్టి అక్షయ్‌కుమార్, పాపయ్యగారి నర్సింలు, సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు నిజాంపేటలో విద్యుత్ అంతరాయం

నిజాంపేట, ఏప్రిల్ 18: నిజాంపేటలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ గణేశ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌కు అంతరాయంకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి

దాసు (ఫైల్)

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 18: కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రుద్రారంలో జరిగింది. మండలంలోని రుద్రారానికి చెందిన క్యాసారం దాసు (30) ఇదే గ్రామానికి చెందిన గొల్ల మల్లయ్య వద్ద గొర్రెలకాపరిగా పని చేస్తున్నాడు. గొర్రెలను మేపుకొంటూ చందంపేట గ్రామ శివారులోకి వెళ్లాడు. నీళ్లు తాగుదామని దాసు ఓ బోరుబావి వద్దకు వెళ్లి స్టార్టర్ డబ్బా ముట్టుకోగానే కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నాగలక్ష్మి, ఐదేండ్ల లోపు ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య శుక్రవారం చిన్నశంకరంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహ పునః ప్రతిష్ఠోత్సవానికి వెంకయ్య నాయుడికి ఆహ్వానం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 18: ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు పెద్దశంకరంపేట లో సీతా రామచంద్రస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవానికి రావాలని కోరుతూ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు రామాలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు ఆహ్వాన పత్రికను అందజేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లో ఆయన నివాసంలో కలిశారు.

ఎస్సైకి సన్మానం

నిజాంపేట, ఏప్రిల్ 18: నిజాంపేట ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాజేశ్‌ను ఆరోగ్యమే మహాభాగ్యం టీం సభ్యులు, వ్యాపారవేత్త వెంకట్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సన్మానించి, మెమెంటో అందజేశారు.

బధిర బాలికపై లైంగిక చేసిన నిందుతుడిని శిక్షించాలి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 18: ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో బధిర బాలికపై లైంగిక దాడి చేసిన దాన్‌సింగ్‌ను కఠినంగా శిక్షించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మహిళా విభాగం నాయకురాళ్లు ముత్యాలు, యశోద, కవిత, దుర్గ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాన్‌సింగ్‌పై పోక్సో చట్టంతో పాటు 2016 ఆర్‌పీడీ చట్టం సెక్షన్ 92(బీ)(డీ)(ఇ) ప్రకారం కేసు నమోదు చేయాలన్నారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 18: దళారులకు పంట విక్రయించి మోసపోవద్దని చందంపేట సొసైటీ చైర్మన్ సత్యనారాయణ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని సూరారం, బాగిర్దీపల్లి గ్రామాల్లో చందంపేట సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మణ్, నాయకులు పవన్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి, మల్లారెడ్డి, సెక్రటరీ పాషా రైతులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **KUNDELLA RAMULU** S/o. Kundella Eadanna, R/o. Plot No. 14/B, Raghavendra Colony, Beeramguda, Ameenpur, Sanga reddy Dist, T.G. My Son name as Kundella Anvesh (Old Name) as per Aadhar No. 6218 2883 1544 and changed my son name as **KUNDELLA ASHWANTH** (New Name) as per Birth Certificate Reg. No. 108, Dt: 26.09.2024

CHANGE OF NAME

I, **KUNDELLA RAMULU** S/o. Kundella Eadanna, R/o. Plot No. 14/B, Raghavendra Colony, Beeramguda, Ameenpur, Sanga reddy Dist, T.G. My Son name as Kundella Daman (Old Name) as per Aadhar No. 5881 5200 1236 and changed my son name as **KUNDELLA DHANUSH** (New Name) as per Birth Certificate Reg. No. 109, Dt: 26.09.2024

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.